## క్లుప్తంగా

### 14న కుందేరు ఆలయ భూముల కౌలు వేలం

కంకిపాడు: మండలంలోని కుందేరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వేణుగోపాల, ఆంజనేయ స్వామి వార్ల దేవస్థానానికి చెందిన భూముల కౌలు వేలం ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఆర్ఎస్ నంబరు 143/5లో ఎకరం, 96/5లో 1.46 ఎకరాల భూమికి కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. 2025-28 సంవత్సరాలకు కౌలు ఇస్తామని, ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

### 20న బహుజన సంకల్ప సభ

కంకిపాడు: బహుజన సంకల్ప సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ పెనమలూరు ఇన్‌చార్జి జి.జయప్రకాష్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ విస్తృత సమావేశం పట్టణంలోని మండేపూడి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. జయప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన అవనిగడ్డ నియోజకవర్గంలోని కొడాలి సెంటర్‌లో బహుజన సంకల్ప సభ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సంకల్ప సభ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం నూతన కమిటీ నియామకం చేపట్టారు. పార్టీ పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా గాలంకి ఉదయభానుకుమార్, ఉపాధ్యక్షుడు ఓసీ ముజీబ్, ప్రధాన కార్యదర్శి దాసరి కోటేశ్వరరావు, కోశాధికారి చోరగుడి నాగేశ్వరరావు, కార్యదర్శి నందేటి రమేష్‌ను నియమించారు. కంకిపాడు మండల అధ్యక్షుడిగా గోవాడ బెర్నాడ్‌షా, పెనమలూరు మండల కన్వీనర్‌గా మాతంగి రేవంత్‌రావు నియమితులయ్యారు.

### పోరంకిలో వాహనాల తనిఖీ



పెనమలూరు: పోరంకి 100 అడుగుల రోడ్డులో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో లారీలు, వ్యాన్‌లు, కార్లు, బైక్‌లు తనిఖీ చేశారు. భారత్-పాక్ యుద్ధం సందర్భంగా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. అదే విధంగా నిబంధనల ప్రకారం వాహనాల సీబుక్, లైసెన్స్, నమోదైన ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు సైతం పరిశీలించామని తెలిపారు. వాహనాలపై కేసుల జరిమానా ఉంటే వెంటనే చెల్లించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు చెందిన పత్రాలన్నీ వాహనంలో ఉంచుకోవాలని, పోలీసుల తనిఖీల సమయంలో చూపాలని సూచించారు. వాహనాల తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### పీవీ రావు ఆశయ సాధనకు కృషి



కంకిపాడు: మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు ఆశయ సాధనకు కృషి చేస్తామని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగుల మూడి రాజు అన్నారు. పీవీ రావు 76వ జయంతిని శనివారం రాత్రి కంకిపాడులోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాల సామాజిక వర్గ సంక్షేమానికి పీవీ రావు పాటుపడ్డారన్నారు. ఆయన న్యాయ పోరాట దక్షతను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పీవీ రావు ఆశయ సాధనకు మాలలు ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వజ్రై చిట్టిబాబు, సరిహద్దు ఆంతోని తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన కరణం నాగరాజు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. అతని చిన్న కుమారుడు కరణం దుర్గాప్రసాద్ విజయవాడలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజుల క్రితం తల్లిని రూ.2 వేలు అడుగ్గా తల్లి సొమ్ము లేదని చెప్పింది. దీంతో అతను అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికారు. దుర్గాప్రసాద్ ఆచూకీ తెలియకపోవటంతో నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

# అభివృద్ధికి దూరంగా క్రీడా మైదానాలు

- జెడ్పీ హైస్కూళ్ల క్రీడా ప్రాంగణాల్లో సమస్యల నెలవు
- ప్రభుత్వం నిధులు కేటాయించాలని వినతి
- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో కొండ రాళ్లు



నీటిలో మునిగి ఉన్న ముస్తాబాద జడ్పీహైస్కూల్ క్రీడా మైదానం(ఫైల్)

గన్నవరంరూరల్: క్రీడలతో విద్యార్థులకు మనో వికాసం కలుగుతుందని చెప్పడం ప్రసంగాలకే పరిమితమవుతోంది. అందుకు అవసరమైన క్రీడా మైదానాలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి, గొల్లనపల్లి, వీరపనేనిగూడెం హైస్కూల్‌లు, గురుకుల పాఠశాల ఆవరణలలో ఉన్న ఆట స్థలాలు విద్యార్థులు ఆడుకునేందుకు వీలు లేకుండా ఉన్నాయి. వీటి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**ఆయా పాఠశాలల్లో**

వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 290 మంది, గురుకుల పాఠశాలల్లో 600 మంది, ముస్తాబాద హైస్కూల్‌లో 280 మంది, గొల్లనపల్లిలో 200కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరి శ్రేయస్సు కోసం దశాబ్దాల క్రితమే ఆట స్థలాలు ఏర్పాటు చేశారు. క్రీడలతో విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, మానసిక వికాసం, శారీరక దృఢత్వం కలుగుతాయని పదే పదే చెబుతారు. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**అధ్వానం.. గురుకుల క్రీడా మైదానం**

వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలల్లో జిల్లాలోని నలుమూలల నుంచి సీట్లు పొందిన విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఆవరణ మొత్తం సుమారు మూడెకరాలకుపైగా ఉంది. అయితే కొండపోరంబోకు కావటంతో పెద్దపెద్ద బండరాళ్లు ఉన్నాయి. నడిచేందుకు కూడా వీలు లేని దుస్థితిలో ఈ మైదానం ఉంది. దీనిని అభివృద్ధి చేయాలని అనేక సార్లు గురుకుల సొసైటీకి ఇక్కడి అధికారులు విజ్ఞప్తి చేశారు. అయినా చర్యలు శూన్యం కావటంతో రాళ్ల మధ్యే విద్యార్థినులు ఆటలు కొనసాగిస్తున్నారు.

**కొండ రాళ్లతో వీరపనేనిగూడెం హైస్కూల్ గ్రౌండ్**

వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్ ఆవరణ మొత్తం కొండ రాళ్లతో నిండి ఉంది. చదునుగా ఉన్న ప్రదేశంలో తాత్కాలికంగా ఆటలు ఆడిస్తున్నారు. ఈ పాఠశాలకు తెంపల్లి, బల్లిపర్రు, కొత్తగూడెం, మెట్లపల్లి, బండారుగూడెం గ్రామాల నుంచి విద్యార్థులు చదువులకై నిరంతరం వస్తుంటారు. అయితే ఆడుకునేందుకు అనువైన క్రీడా మైదానం లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు.

**నీట మునిగిన ముస్తాబాద క్రీడా మైదానం**

ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌కు సంబంధించి క్రీడా మైదానం పక్కనే ఉన్న పెద్ద చెరువులో మునిగి ఉంది. దీనిని బాగుజేయించి చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యార్థులకు ఆటలు ఆడేందుకు అనువైన పరిస్థితి ఏర్పాటు చేయాల్సి ఉంది. పాఠశాల ఆవరణ సుమారు మూడు ఎకరాలకు పైగా నీట మునిగి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాలకు సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల నుంచి విద్యార్థులు చదువుల కోసం వస్తుంటారు. ఆటలు లేక, మానసిక వికాసం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**మానసిక వికాసానికి ఆటలు అవసరం**



పాఠశాలలకు క్రీడా మైదానాలు ఎంతో అవసరం. విద్యార్థుల శారీరక దృఢత్వానికి ఆటలు ఉపయోగపడతాయి. క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి విద్యార్థులను బహుముఖంగా తీర్చిదిద్దాలి.

– బెజవాడ తాతబ్బాయి, గ్రామస్తుడు, చనుపల్లివారిగూడెం

**నిధులు విడుదల చేయాలి**



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల శ్రేయస్సు కోసం క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే క్రీడా మైదానాలు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి.

– మల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి

## కనులపండువగా కల్యాణ మహోత్సవం



పోరంకిలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీవసంత వేణుగోపాల స్వామి, శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో కల్యాణ మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవసంతవేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు నిత్య హోమం, బలిహేరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో నవ కుంభారోహణ, నిత్యహోమం, చింతా వెంకట్ నాట్య మండలి వారిచే భరతనాట్య ప్రదర్శన చేశారు. రాత్రి 7.30 గంటలకు శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణ మహోత్సావాన్ని తిలకించారు. సోమవారం ఉదయం 7 గంటలకు స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించి గ్రామోత్సవం చేస్తారు. రాత్రి 7 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి పవళింపుసేవ నిర్వహిస్తారు.

## చినకంచిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నున్న(విజయవాడరూరల్): ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి దివ్య క్షేత్రం చినకంచిలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గణపతి పూజ పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, యజమానులచే జరిపించిన బ్రాహ్మణులు అఖండ దీపారాధన అగ్ని ప్రతిష్ఠాపన చేయించారు. తదుపరి లక్ష్మీనరసింహస్వామి వారికి 108 కలశాల వానకంతో 108 సార్లు పురుష సూక్తాన్ని చెబుతూ అభిషేకం చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి అష్టోత్తర శతనామాలతో పూజ చేశారు. పిమ్మట వరుణ ఇప్పించి చెంగల్వల ఉమామహేశ్వరరరావు శ్రీవల్లీ దంపతులకు కంకణ ధారణ చేయించారు. హోమాలు నిర్వహించారు. జంధ్యాల మధు, విజయకుమార్ దంపతులు పాల్గొని కలశ పూజలు చేయించి లక్ష్మీనరసింహస్వామి వారికి వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. ఎడవల్లి శివ వేద పండితులు పవన కుమారశర్మ, ఆలయ అర్చకులు, వేద విద్యార్థులు కార్యక్రమాలను నిర్వహించారు. పూర్ణిమ కావడంతో చండీ హోమం చేశారు. ఈశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపించారు.

## వైభవంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్త బృందం, ఆలయ ప్రతినిధులు

కంకిపాడు: మండలంలోని కుందేరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి, ఆంజనేయ స్వామి వార్ల దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు సాగనున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఆలయం ప్రాంగణంలో నిత్య హోమం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామానికి చెందిన భక్త జనం అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఈ నెల 12న వసంతోత్సవం, చక్రస్నానం, గ్రామోత్సవం, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. 13న సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల సేవ, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నారు. బ్రహ్మోత్సవాలను దీవి రామకృష్ణమాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్య, కుందేరు వెంకట జనార్దన శర్మ, మండా సత్యనారాయణ పర్యవేక్షించారు.

# ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



వణుకూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో..



గన్నవరంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



ముస్తాబాదలో ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న విద్యార్థులు



పురుషోత్తపట్నంలో కథలు వింటూ..

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరై విజ్ఞానం పొందుతున్నారు. విద్యార్థుల సందడితో గ్రంథాలయాల్లో కోలాహలం నెలకొంది. స్థానిక మండల పరిషత్ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం క్యారమ్స్, చదరంగం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పఠనాభిలాషను పెంపొందించి, వారిలోని సృజనాత్మక శక్తిని ప్రోత్సహించేందుకు విజ్ఞాన శిబిరం దోహదపడుతుందన్నారు. నెల రోజుల పాటు జరిగే శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ పీడీ.లక్ష్మి, విశ్రాంత ఉద్యోగి ధర్మారావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**భావ ప్రకటన నేర్పించాలి**

గన్నవరంరూరల్: విద్యార్థులకు చిన్ననాటి నుంచే భావ ప్రకటన నేర్పించాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. ఆదివారం సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత ఉపన్యాసంపై శిక్షణ ఇచ్చారు. ఎవరికీ వారు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా ప్రకటించేందుకు ప్రయత్నించాలని, దీంతో స్టేజ్ ఫియర్ ఉండదన్నారు. విద్యార్థులకు కథలు చెప్పారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థులు విజయ శిఖరాలకు చేరతారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు జరిగింది. ఆరోగ్యం పట్ల చిన్ననాటి నుంచి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులచే ఎక్సర్‌సైజ్‌లు చేయించారు. పుస్తక పఠనం, యోగాభ్యాసం చేయించారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**పుస్తక పఠనంతోనే విజ్ఞానం**

పెనమలూరు: పుస్తక పఠనంతోనే విజ్ఞానం కలుగుతుందని వణుకూరు శాఖ గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. గ్రామంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పుస్తకాలు చదవటం వలన అనేక విషయాలు విద్యార్థులకు తెలుస్తాయన్నారు. విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆనందం కోసం తోక కథలు, క్రాఫ్ట్ వర్క్, క్యారమ్స్ ఆడించారు.

**కొనసాగుతున్న వేసవి శిబిరాలు**

కంకిపాడు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కోలాటం, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. కథలు చెప్పటం, వినిపించటం, అందులో నీతిని తెలియజెప్పటం చేశారు. చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని వక్తలు సూచించారు. శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

**పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం**

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు నీతికథల పుస్తకాలను పరిచయం చేశారు. పంచతంత్రంతో పాటు పలు రకాల నీతికథలు, తెలుగు జానపద పాటలు, తెలుగు పద్యాల పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివించారు. నీతి కథలు, సుభాషిత పద్యాలు చదవటం ద్వారా తెలుసుకున్న నీతి గూర్చి విద్యార్థులతో చెప్పించారు. పుస్తకాలు చదవటం వల్ల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అలవర్చుకోవచ్చని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరటానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

## వీర జవాన్ల త్యాగాలు మరువలేం



వీరజవాన్ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

గన్నవరం: స్థానిక వీఎస్ పురం రోడ్డులోని అయోధ్య గేటెడ్ కమ్యూనిటీ రెసిడెన్సీలో ఆదివారం ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు కాలనీ వాసులు శ్రద్ధాంజలి ఘటించారు. వీరజవానుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు ఎం.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతికారంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌ను మట్టి కరిపించిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై భారత్‌లో ఉగ్రవాద చర్యలు చేపడితే గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరిక చేసినట్లుగా ఉందన్నారు. సరిహద్దు వద్ద పాకిస్తాన్ సైనికుల కాల్పులను తిప్పికొడుతున్న క్రమంలో రాష్ట్రానికి చెందిన మురళీనాయక్‌తో పాటు మరికొంత మంది భారత జవాన్లు వీరమరణం పొందడం దురదృష్టకరమన్నారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరజవాన్లు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. కాలనీ ప్రముఖులు రాజు, డేగల చిన్నపుల్లయ్య, గోపినాథ్, దుర్గారావు, గోపిరావు తదితరులు పాల్గొన్నారు.

**మురళీనాయక్ యువతకు స్ఫూర్తిదాయకం**

కంకిపాడు: పాక్ కాల్పుల్లో మృతి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాక్ దుశ్చర్యకు మురళీనాయక్ బలికావటం బాధాకరమన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన త్యాగాన్ని యువత ఆదర్శంగా తీసుకుని దేశ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. మురళీనాయక్ యోధుడని కొనియాడారు.

## శాస్త్రోక్తంగా నృసింహ జయంతి వేడుకలు



కోదండ రామాలయంలో నరసింహునికి చందనోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో నృసింహ జయంతి వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైష్ణవాలయాలతో పాటుగా ప్రముఖ ఆలయాల్లోని నృసింహ ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**కోదండ రామాలయంలో...**

పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ కోదండ రామాలయంలో నృసింహ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామివారి ఉత్సవమూర్తులకు ఉదయం పంచామృత తిరుమంజనం జరిగింది. పంచామృతాలతో పాటుగా వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఈ సందర్భంగా విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామివారికి సహస్రనామార్చన, చందనోత్సవాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఆదిలక్ష్మి అమ్మవారికి స్వామివారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు నిర్వహించారు. నగరంలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ నరసింహస్వామివారి ఉపాలయంలో స్వామివారికి తిరుమంజన అభిషేకాన్ని జరిపారు. అనంతరం సహస్రనామార్చన జరిగింది. కార్యక్రమాలను వేణుగోపాలాచార్యులు నిర్వహించారు.

### నేడు లక్ష తమలపాకుల అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కల్యాణం, భారత సైనికుల రక్షణార్థం ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం ఆంజనేయస్వామివారికి లక్ష తమలపాకుల అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్, చిన్నారులు, యువత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ఆదివారం కేఎల్‌రావు పార్కు నుంచి పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్కు హ్యాపీ వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్క్ బ్యాడ్మింటన్ అండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాకర్స్ ర్యాలీలో పాల్గొన్నారు. పార్కు వద్ద ప్రారంభమైన ర్యాలీని ఉద్దేశించి అసోసియేషన్ల అధ్యక్షులు బీఎస్‌కే పట్నాయక్, వేశపోగు ఆల్ఫ్రెడ్, జీ రామకృష్ణారావు ప్రసంగించారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికులకు దేశ ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఇద్దరు మహిళా జవాన్లకు దేశప్రజలందరి తరఫున అభినందనలు తెలుపుతున్నామని చెప్పారు. దేశం కోసం అందరం కలిసిమెలసి పని చేయాలని ఇటువంటి విపత్తు పరిస్థితుల్లో సైనికులతో కలిసి పని చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కేఎల్‌రావు పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ వీఎంసీ కాలనీ, కేటీ రోడ్డు, కలరా హాస్పిటల్ మీదుగా సాగింది. ర్యాలీలో భారత్ మాతాకీ జై.. అంటూ చిన్నారులు, యువత నినాదాలు చేశారు. కార్యక్రమంలో జగుపిళ్ల శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వరరావు, ఎం.ప్రసాద్, సుబ్బారావు, మదన్‌మోహన్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని బాల విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులంతా ఆదివారం సందడి చేశారు. బెంజిసర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు అవినాష్ చేతుల మీదగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ కలయిక పేరుతో నాటి గురువులను పిలిచి వారిని సత్కరించి ఆశీస్సులు పొందడం గొప్పవరమన్నారు. స్కూల్ చైర్మన్ కొడవటి అప్పారావు, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి ఆశీస్సులతో ఎంతో మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివారని గుర్తు చేశారు. బాల విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో చదివిన విద్యార్థులు గురువుల దీవెనలతో ఉన్నత స్థానంలో స్థిరపడటం శుభపరిణామం చెప్పారు. వైఎస్సార్ సీపీ 13వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు ఏకాగ్రత అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): కరాటేతో శరీర దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని నున్న ఎస్ఐ విమల తెలిపారు. ఆదివారం పాయకాపురంలో క్యోఇకు కరాటే అకడమీలో చీఫ్ కోచ్ బల్లం కిషోర్ ఆధ్వర్యంలో నాంచాక్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నున్న ఎస్ఐ విమల మాట్లాడుతూ కరాటే విద్యార్థులకు ఏకాగ్రత అవసరమని చెప్పారు. రెప్పపాటు వేగంతో కదిలే విధంగా శరీరాన్ని మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఇలాంటి విద్యలు నేర్చుకొని తమను తాము కాపాడుకోవచ్చన్నారు. గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బల్లం కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.